

జయప్రదం చేయండి

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని జీపీ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. 8లో▸



ఆపదలో ఉన్నవారికి 'ఆర్ట్'..

ఆపదలో ఉన్నవారిని అదుకునేందుకు ఆర్ట్ సంస్థ పనిచేస్తోందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి అన్నారు. 8లో▸



నిబంధనలు తప్పనిసరి

ధాన్యం కొనుగోళ్లలో నింబంధనలు పాటించాలని డీఆర్‌డీఏ డీపీఎంలు నర్సింహ, విలాస్‌రావు అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు

రేపటి నుంచి 13 వరకు తొమ్మిది బృందాల పర్యటన

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్తంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల ఐదు నుంచి 13 వరకు తొమ్మిది బృందాలు, 54 గ్రామాల్లో పర్యటించి సహజ వనరులు, పంట మార్పిడి, చెట్ల పెంపకం, సాగునీటి యాజమాన్యం, విత్తనాలు, రసాయనాల కొనుగోలు చేసిన రసీదులను భద్రపరుచుకోవడం వల్లే చేకూరే ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నట్లు సహజ వనరుల విభాగం సంచాలకురాలు డాక్టర్ కేపీ వాణి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. జిల్లాలోని మొయినాబాద్, కొత్తూరు, చేవెళ్ల, శంషాబాద్, మహేశ్వరం మండలాల్లోని రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సర్వే షురూ..



మీరాఖాన్‌పేట రెవెన్యూలో ప్రారంభమైన సర్వే

కందుకూరు: ఫార్మాసిటీ కోసం గత ప్రభుత్వం సేకరించి పరిహారం చెల్లించిన భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు అధికారులు శనివారం సర్వే పనులు ప్రారంభించారు. మండల పరిధిలోని మీరాఖాన్‌పేట, పంజుగూడ రెవెన్యూలో గతంలో సేకరించిన భూములను సర్వేచేసి వాటి చుట్టూ కంచె ఏర్పాటు చేయనున్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఫ్యూచర్‌సిటీ పోలీస్ స్టేషన్ సీఐ కృష్ణంరాజుతో పాటు కందుకూరు సీఐ సీతారామ్, పహడీషరీఫ్ డీఐ జితేందర్‌రెడ్డి పర్యవేక్షణలో నలుగురు ఎస్‌ఐలు, 60 మంది పోలీసు కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫెన్సింగ్ విషయంలో రైతులకు ఇబ్బందులు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని, అందుకు తాము సహకరిస్తామని సీఐ కృష్ణంరాజు ఈ సందర్భంగా తెలిపారు.

పీడీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్(పీడీ) పోస్టుకు మహిళా అభ్యర్థులు దరకాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె శనివారం ఓ ప్రకటనలో కోరారు. కళాశాలలో ఖాళీగా ఉన్న పీడీ పోస్టు భర్తీ కోసం ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. అర్హులు ఈ నెల 7వ తేదీలోగా తమ అర్హత సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలన్నారు.

పాలిసెట్ ఎంట్రెన్స్‌కు ఉచిత శిక్షణ తరగతులు

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న పాలిటెక్నిక్ కాలేజీలో ప్రవేశాల కోసం ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ పరమేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ ఎంట్రెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 5వ తేదీ నుంచి ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు క్లాసులు కొనసాగుతాయని తెలిపారు.

ప్రభుత్వ పథకాలతో పేదలకు మేలు

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి



మున్సిపల్ ఉపాధ్యక్షురాలిగా నియామకపత్రం అందుకుంటున్న స్వరూప

మొయినాబాద్ రూరల్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెడుతున్న పథకాలు ప్రజలకు మేలు చేకూరుస్తున్నాయని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పామెన జ్యోతి అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ మున్సిపల్ ఉపాధ్యక్షురాలిగా చిలుకూరు మాజీ సర్పంచ్ గునుగుర్తి స్వరూపకు నియామకపత్రం అందజేశారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు.



తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు, బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన



భారీ వర్షానికి రోడ్డుపై పారుతున్న నీరు

అన్నదాతకు అకాల కష్టం

- భారీవర్షానికి తడిసిన ధాన్యం
- టార్పాలిన్లు లేకపోవడంతో కొట్టుకుపోయిన వైనం

ఆమనగల్లు: పట్టణంలో శనివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం అన్నదాతలను ఆగమాగం చేసింది. ముప్పావుగంట పాటు దంచికొట్టిన వానతో కాలనీలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారిపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఈదురు గాలులకు చెట్లు నేలకూలాయి. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు ఆరబోసిన వడ్లు కొట్టుకుపోయాయి. టార్పాలిన్లు అందుబాటులో లేక పలువురి ధాన్యం కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు మార్కెట్ యార్డు ఎదుట హైదరాబాద్–శ్రీశైలం రహదారిపై ఆందోళన చేపట్టారు. బీఆర్‌ఎస్ నాయకులు వీరికి మద్దతు తెలిపారు. కర్షకుల ఆందోళనతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వచ్చి నచ్చజెప్పడంతో రైతుల ఆందోళన విరమించారు. బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్ మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.



తడిసిన ధాన్యాన్ని ఒక్కచోటకు చేరుస్తున్న మహిళా రైతు

బినామీ దందా!

- రంగారెడ్డి జిల్లాలోని ఓ డీసీఎంఎస్ దుకాణ సముదాయం పట్టర్ల కేటాయింపులో రూ.6 లక్షల డిపాజిట్, నెలకు రూ.6 వేల అద్దె చెల్లిస్తామని ఓ వ్యక్తి ముందుకొచ్చారు. పాలకవర్గం అధికారులు దీన్ని తిరస్కరించి, ఎలాంటి ఓపెన్ ఆక్షన్ లేకుండా రూ.లక్ష డిపాజిట్, నెలకు రూ.3 వేల అద్దె చొప్పున తమ బినామీలకు కట్టబెట్టారు.
- వికారాబాద్ జిల్లా తాండూరు, పరిగి రైస్ మిల్లుల కేటాయింపుల్లో పాలకవర్గం అధ్యక్షుడు, బిజినెస్ మేనేజర్లకు అనుకూలమైన వ్యక్తులకు లీజుకు ఇచ్చారని, వారి నుంచి రూ.10 లక్షలు వసూలు చేసి, రూ.7 లక్షలు సంఘానికి చెల్లించి, రూ.3 లక్షలు పంచుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా డీసీఎంఎస్‌కు రూ.24 లక్షల మేర నష్టం జరిగింది.
- శంకర్‌పల్లి, చేవెళ్ల, పాలమాకుల, మేడ్చల్ సంఘాల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా దుకాణ సముదాయాల నిర్మాణ పనులను తమ వారికి కట్టబెట్టారు. కేటాయింపుల్లోనూ బినామీ పేర్లతో వారి అనుకూల వర్గాలకే అప్పగించారు. అనంతరం మూడో వ్యక్తికి అద్దెకు ఇచ్చారు. ప్రస్తుతం చిన్న వర్షానికే దుకాణాలు కురుస్తున్నాయని వ్యాపారులు ఫిర్యాదు చేశారు.
- ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా సిబ్బందికి మూడు దఫాలుగా వేతనాలు పెంచారు. ఆరు నెలల ముందే పెంచినట్లు లెక్కలు చూపి, ఈకాలానికి సంబంధించిన సుమారు రూ.50 లక్షలు పక్కదారి పట్టించారనే ఆరోపణలున్నాయి. గతేడాది ఆగస్టు 14న జరిగిన పాలకవర్గ సమావేశంలో బోనస్ ఇవ్వడం కుదరని తేల్చి చెప్పారు. కానీ బిజినెస్ మేనేజర్ బోనస్ విడుదల చేశారని తెలుస్తోంది.
- వికారాబాద్ జిల్లాలోని 30 డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రాల పేర్లపై ఎరువులు, విత్తనాల విక్రయాలను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించి, ఒక్కొక్కరి నుంచి రూ.1.5 లక్షలు వసూలు చేస్తున్నారని, అందులో రూ.లక్ష డీసీఎంఎస్‌కు చెల్లించి, రూ.50 వేలు పాలకవర్గం, బిజినెస్ మేనేజర్లు పంచుకుంటున్నారని ఆరోపణలున్నాయి.

డీసీఎంఎస్‌లలో అక్రమాల తిష్ట

- బినామీ పేర్లతో దుకాణాలు
- జోరుగా అనధికారిక నిర్మాణాలు
- అమ్మకానికి తాండూరు కంది మిల్లు, పరిగి విత్తన శుద్ధి కేంద్రం
- రైస్ మిల్లుల కేటాయింపుల్లోనూ అవినీతి
- పాలకవర్గం, బిజినెస్ మేనేజర్ల తీరుపై ఆరోపణలు



డీసీఎంఎస్ వికారాబాద్ శాఖ కార్యాలయం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లా సహకార మార్కెటింగ్ సంఘంలో పాలకవర్గం సభ్యులు, అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతోంది. సంఘానికి వచ్చే ఆదాయ మార్గాలను పక్కన పెట్టి వ్యక్తిగత లాభాపేక్షకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా దుకాణ సముదాయాలు నిర్మించడం, వాటిని బినామీ పేర్లతో సొంతం చేసుకోవడం పరిపాటిగా మారింది. దీంతో సంఘానికి రూ.కోట్లలో నష్టం జరుగుతోందని పాలకవర్గ సభ్యులే ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

ఎక్కడ చూసినా..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీఎంఎస్ పరిధిలోని వికారాబాద్, తాండూరు, పరిగి, శంకర్‌పల్లి, చేవెళ్ల, పాలమాకుల, మేడ్చల్ ఇలా ఎక్కడ చూసినా అక్రమాలే కనిపిస్తున్నాయి. దుకాణాల కేటాయింపుల్లో అధిక మొత్తంలో డిపాజిట్, అద్దె చెల్లించే వారికి అప్పగించాల్సి ఉన్నా, బినామీ పేర్లతో దుకాణాలు సొంతం చేసుకుంటున్నారు. వీటిని అధిక అద్దెకు మూడో వ్యక్తికి కట్టబెడుతున్నారు. దీంతో సంఘాలకు డిపాజిట్, అద్దె రూపంలో రూ.కోట్లలో నష్టం వాటిల్లుతోంది. తాండూరులో 30 ఏళ్ల క్రితం పప్పు మిల్లు, పరిగిలో 25 ఏళ్ల క్రితం విత్తన శుద్ధి ఫ్యాక్టరీని నిర్మించారు. ఈ రెండూ గతంలో మంచి లాభాలు ఆర్జించాయి. కొంతకాలంగా వీటిని ఆపేశారు. తాజాగా ఎలాంటి అనుమతులు లేకుండానే వీటి అమ్మకానికి తీర్మానాలు చేశారు. వికారాబాద్ జిల్లా ధారూరు, రంగారెడ్డి జిల్లా చేవెళ్ల గిడ్డంగుల అమ్మకానికి సిద్ధమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ అవకతవకలు జరుగుతున్నాయి. గతంలో ప్రభుత్వ అధికారులు నిర్వహించే సెంటర్లను ప్రస్తుతం కమిషన్ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. వీరు తరుగు పేరుతో రైతులకు 4నుంచి 6 కేజీల నష్టం చేస్తున్నారని, సంఘానికి రావాల్సిన ఆదాయం కోల్పోతున్నామని సభ్యులు ఆరోపిస్తున్నారు. గతంలో కొడంగల్ కందుల కొనుగోలు కేసులో ఉన్న వ్యక్తులు తాజాగా ఈ అక్రమాల్లో సూత్రధారులుగా ఉన్నారని సమాచారం.

విచారణ చేపడతాం

దుకాణాల కేటాయింపుల్లో అక్రమాలపై ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. సంస్థ ఆస్తులు అమ్మకాలకు సంబంధించి తీర్మానాలు చేసినా, ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతులు రాకపోతే అది వీలు పడదు.

– సుధాకర్, జిల్లా సహకార అధికారి

ఏవైపు చూసినా..!

- మందు బాబుల హంగామా
- విచక్షణ కోల్పోయి వివాదాలు, ర్యాష్ డ్రైవింగ్
- ఆవాసాల మధ్యే కొనసాగుతున్న మద్యం దుకాణాలు
- స్థానికుల అభ్యర్థనలను పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



చేవెళ్లలోని శంకర్‌పల్లి రోడ్డు పక్కన ఉన్న వైన్స్ వద్ద నిలిపిన ద్విచక్రవాహనాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మద్యం ప్రియులు వీధుల్లో వీరంగం సృష్టిస్తున్నారు. పీకలదాకా తాగిన తర్వాత విచక్షణ కోల్పోయి విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. అడ్డొచ్చిన వాళ్లను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు దాడులకూ తెగబడుతున్నారు. సర్వీసు రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ హిట్ అండ్ రన్‌కు కారణమవుతున్నారు. ఆవాసాల నడుమ మద్యం దుకాణాలకు అనుమతి ఇవ్వొద్దని, ఇప్పటికే కొనసాగుతున్న వాటిని దూర ప్రాంతాలకు తరలించాలని బాధితులు, కాలనీ సంక్షేమ సంఘాలు చేస్తున్న వినతులను ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటు చంపాపేట నుంచి అటు తుర్కయంజాల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న వైన్‌షాపులు సహా అటు నాగోలు నుంచి ఇటు డీఆర్‌డీఓ వరకు ఉన్న వైన్‌షాపులు సాయంత్రమైందంటే మందుబాబులతో రద్దీగా మారుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా వాహనాలపై కూర్చుని మద్యం సేవిస్తున్నారు. దీంతో విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

అమ్మకాలపైనే దృష్టి

సరూర్‌నగర్ ఎక్సైజ్ జిల్లా (సరూర్‌నగర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, ఆమనగల్లు, షాద్‌నగర్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్ల) పరిధిలో 134 మద్యం దుకాణాలు, శంషాబాద్ ఎక్సైజ్ జిల్లా(శంషాబాద్, శేరిలింగంపల్లి, చేవెళ్ల ఎక్సైజ్ పోలీసు స్టేషన్ల) పరిధిలో 100, వికారాబాద్ జిల్లా(వికారాబాద్, పరిగి, తాండూరు, మోమిన్‌పేట్, కొడంగల్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్ల)లో 59, మేడ్చల్ జిల్లా (మేడ్చల్, కుత్బుల్లాపూర్, బాలానగర్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్ల)లో 114, మల్కాజ్‌గిరి (మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్ల) పరిధిలో 88 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఒక్క రంగారెడ్డి జిల్లా పరిధిలోనే నెలకు సగటున రూ.650 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఎక్సైజ్‌శాఖ అధికారులు కేవలం అమ్మకాలపైనే దృష్టిసారిస్తున్నారు. వైన్‌షాపులకు అటు ఇటుగా ఉన్న స్థానికుల అభ్యంతరాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

చేవెళ్ల: మండల కేంద్రంలో ప్రధానంగా నాలుగు మద్యం దుకాణాలు కొనసాగుతున్నాయి. ఊరెళ్ల, రామన్నగూడ, దేవునిఎర్రవల్లి రోడ్డు పక్కన వీటిని ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు మద్యం కోసం వచ్చే వారితో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. వైన్స్‌ల ఎదుట బైక్‌లు, కార్లను రోడ్లపైనే నిలుపుతుంటారు. దీంతో ఇతర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. శంకర్‌పల్లి రోడ్డు పక్కనే ఉన్న మరో వైన్ షాప్ వద్ద ఆరుబయటే మద్యం తాగుతుంటారు.



కుర్మిద్దలో రైతులు, టీజీఐఐసీ అధికారులతో మాట్లాడుతున్న గ్రీన్ ఫార్మాసిటీ ఎస్‌ఐ తేజంరెడ్డి

కుర్మిద్దలో ఉద్రిక్తత

- కోర్టు కేసులున్న భూముల్లో పనులు ప్రారంభించిన టీజీఐఐసీ అధికారులు
- అడ్డుకున్న రైతులు
- పనులు నిలిపేసిన గ్రీన్ ఫార్మాసిటీ ఎస్‌ఐ తేజంరెడ్డి

యాచారం: కుర్మిద్ద గ్రామంలో టీజీఐఐసీ, రైతుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కుర్మిద్ద–నస్దిక్‌సింగారం గ్రామాల మధ్య కోర్టు కేసులున్న ఫార్మా పట్టా భూముల్లో శనివారం చదును పనులు చేపట్టారు. టీజీఐఐసీ అధికారులు జేసీబీలు తెచ్చి చెట్లు తొలగించడం, భూమిని చదును చేసి బౌండరీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి వెళ్లి అభ్యంతరం తెలిపారు. కోర్టు కేసులున్న భూముల్లో పనులు ఎలా చేపడతారంటూ అధికారులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఎస్‌ఐ తేజంరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని రైతులు, టీజీఐఐసీ అధికారులతో మాట్లాడారు. కోర్టు కేసులున్న భూముల్లో రైతులు అభ్యంతరం తెలిపితే పనులు చేపట్టవద్దని టీజీఐఐసీ అధికారులకు సూచించారు. ఎస్‌ఐ సూచన మేరకు టీజీఐఐసీ అధికారులు అక్కడి నుంచి జేసీబీలను తీసుకెళ్లడంతో రైతులు శాంతించారు.

ఎంపీడీఓ కార్యాలయానికి తాళం

- ఆరేళ్లుగా అద్దె చెల్లింపులో జాప్యం
- అధికారుల హామీతో తాళం తీసిన యజమాని



కార్యాలయ పరిశీలనకు వచ్చిన అధికారులు

కొందుర్గు: అద్దె చెల్లించలేదని ఎంపీడీఓ కార్యాలయానికి తాళం వేసిన ఘటన శనివారం జిల్లేడు చౌదరిగూడలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన చెందిన కోనేరు శ్రీనివాస్ ఆరేళ్ల క్రితం మండల కేంద్రంలోని తన ఇంటిని ఎంపీడీఓ కార్యాలయానికి అద్దెకు ఇచ్చాడు. ప్రతీ నెల రూ.10,942 అద్దె చెల్లించేలా ఆయన అధికారులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. నేటి వరకు ఒక్క రూపాయి అద్దె చెల్లించకపోవడంతో శనివారం ఇంటి యజమాని శ్రీనివాస్ ఎంపీడీఓ కార్యాలయానికి తాళం వేశాడు. ఈ విషయమై ఎంపీడీఓ ప్రవీణ్‌ను వివరణ కోరగా మొదట్లో శ్రీనివాస్‌కు రూ.50 వేలు అడ్వాన్స్ చెల్లించినట్లు తెలిపారు. ఆ తర్వాత మూడు విడతలుగా రూ.60వేలు, రూ.16వేలు, రూ.10వేలు చెక్కులు ఇచ్చామన్నారు. డబ్బులు లేకపోవడంతో శ్రీనివాస్ ఖాతాలో నగదు జమ కాలేదన్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని త్వరలో అద్దె చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆయన కార్యాలయానికి వేసిన తాళం తీశారు.

అధికారుల బృందానికి కలెక్టర్ అభినందనలు

మాల్‌కు ఏఎన్‌పీఎస్‌ఏ అవార్డు రావడంపై హర్షం



అధికారుల బృందాన్ని అభినందిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

యాచారం: మండల పరిధిలోని మాల్ గ్రామ పంచాయతీకి ఆత్మ నిర్భర్ నేషనల్ పంచాయతీ అవార్డు రావడంపై కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను అభినందించారు. జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, ఇబ్రహీంపట్నం డివిజన్ పంచాయతీ అధికారి సాధన, యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, యాచారం మండల పంచాయతీ అధికారి శ్రీలత, మాల్ పంచాయతీ కార్యదర్శి రాజు శనివారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారుల బృందాన్ని ఘనంగా సత్కరించి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.

'ఎర్లీబర్డ్'కు స్పందన కరువు

- ఐదు శాతం రాయితీ ప్రకటించినా ముందుకు రాని మున్సిపల్ వాసులు
- షాద్‌నగర్‌లో 27 శాతం, కొత్తూరులో 14 శాతం చెల్లింపులు
- ఈ నెల 7వ తేదీ వరకు గడువు పెంపు



షాద్‌నగర్‌లో ముందస్తు పన్ను చెల్లించిన ఇంటి యజమానిని సన్మానించిన అధికారులు(ఫైల్)

షాద్‌నగర్: మున్సిపాలిటీల్లో ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎర్లీ బర్డ్ పథకాన్ని అమలు చేస్తోంది. గతంలో ఎలాంటి బకాయిలు లేని వారు ముందస్తుగా మొత్తం పన్ను చెల్లిస్తే అందులో ఐదు శాతం రాయితీని కల్పిస్తోంది. కానీ ముందస్తు చెల్లింపులకు ఇళ్ల యజమానుల నుంచి స్పందన అంతంతమాత్రమే వచ్చింది.

షాద్‌నగర్‌లో రూ.1.94 కోట్ల వసూలు

షాద్‌నగర్ మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డుల్లో సుమారు 70వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. 15,933 గృహ, వ్యాపార సముదాయాల నుంచి సుమారుగా రూ.7.22 కోట్లు వసూలు కావాల్సి ఉండగా ఎర్లీ బర్డ్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు సుమారు 27శాతం రూ.1.94 కోట్లు మాత్రమే వసూలు అయ్యాయి.

కొత్తూరులోనూ అంతంతే..

కొత్తూరు మున్సిపాలిటీలో మొత్తం 13,200 జనాభా ఉంది. 2,619 ఇళ్లు, వ్యాపార సముదాయాలున్నాయి. వీటి నుంచి రూ.2.56 కోట్లు పన్నులు వసూలు కావాల్సి ఉంది. ఎర్లీ బర్డ్ పథకంలో అధికారులు ఇప్పటి వరకు సుమారు 14శాతంతో రూ.54 లక్షలు వసూలు చేయగలిగారు.

ప్రచారం నిర్వహించినా స్పందన కరువు

ఎర్లీ బర్డ్ పథకం పై అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రత్యేక బృందాలుగా అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అగాహన కల్పించారు. మున్సిపాలిటీకి సంబంధించిన వాహనాలకు మైకులను ఏర్పాటు చేసి ప్రచారం చేశారు. అయినప్పటికీ ఆశించిన మేర పన్నులు వసూలు కాలేదు. ప్రభుత్వం విధించిన గడువును ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోలేదు.

రాయితీ గడువు పెంపు

ఎర్లీ బర్డ్ పథకానికి ఏప్రిల్ 30తో గడువు ముగిసింది. అయితే ప్రభుత్వం ఈ గడువును ఈ నెల 7వ తేదీ వరకు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సద్వినియోగం చేసుకోవాలి



ఎర్లీబర్డ్ పథకానికి ఈ నెల 7వరకు గడువు పొడిగించారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి.

– బాలాజీ, కమిషనర్, కొత్తూరు మున్సిపాలిటీ

ఆపదలో ఉన్నవారికి 'ఆర్ట్' చేయూత

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి
- గొల్లూరులో ఉచిత వైద్య శిబిరం

మహేశ్వరం: ఆపదలో ఉన్నవారిని అదుకునేందుకు తమ సంస్థ పనిచేస్తోందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, ఆర్ట్(అనితారెడ్డి తీగల) ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ తీగల అనితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గొల్లూరులో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఆమె, రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నిత్యం కొంత సమయాన్ని వాకింగ్, ధ్యానం, యోగాకు కేటాయించాలన్నారు. ఆర్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి హాజరైన సుమారు 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, మాజీ సర్పంచ్ హరినాథ్‌గౌడ్, నాయకులు బాల్‌రాజ్, లోకేశ్వర్‌రెడ్డి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న అనితారెడ్డి

విజయ్‌దేవరకొండపై ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: గిరిజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు విజయ్ దేవరకొండపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలునాయక్ శనివారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓ సినిమా రిలీజ్ ఈవెంట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయ్ దేవరకొండ చేసిన వ్యాఖ్యలు గిరిజనుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా ఉన్నాయని తెలిపారు. దీనిపై తమ సంఘం తరపున పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

సమ్మెను జయప్రదం చేయండి


కేశంపేట: ఏఓ సుధాకర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నర్సింహారెడ్డి


యాచారం: ఎంపీడీఓ నరేందర్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

- జీపీ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి
- డీపీఓ కార్యాలయంలో దేశవ్యాప్త సమ్మె నోటీసు అందజేత

కేశంపేట: కార్మిక చట్టాల రక్షణ కోసం తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఈ నెల 20న నిర్వహించనున్న సమ్మె నోటీసును జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఏఓ సుధాకర్‌కు అందజేశారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న కార్మికచట్టాల్లో కేంద్ర ప్రభుత్వం 29 చట్టాలను రద్దు చేసే కుట్రతో నాలుగు కోడులుగా విభజించింది అన్నారు. పని గంటలను ఎనిమిది నుంచి 12 గంటలుగా మార్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ కార్మికులకు ప్రతీ నెల వేతనాలు ఇస్తూ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులంతా సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి నిరసన గళం వినిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, రవి, యాదమ్మ, భిక్షమయ్య, రామస్వామి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు పోరుబాట

యాచారం: గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ శ్రేణులు శనివారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి సమ్మె నోటీసు అందజేశారు. ఈ నెల 20న నిర్వహించే సమ్మెలో కార్మికులందరూ పాల్గొంటారని తెలిపారు. పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని, పంచాయతీ సిబ్బంది రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను రూ.10 లక్షలకు పెంచాలని, అనారోగ్యానికి గురై మృతి చెందిన సిబ్బంది స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని, ఆయా డిమాండ్ల సాధనకోసం చేపడుతున్న సమ్మెకు మద్దతివ్వాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు, జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య, యాచారం మండల కన్వీనర్ చందునాయక్, జిల్లా నాయకులు పోచమోని కృష్ణ, బోడ కృష్ణ, జంగయ్య, శంకర్, రాజు, పాండయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి తండా సందర్శన

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి శనివారం తక్కళ్లపల్లితండాను సందర్శించారు. తండాలో తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యలపై గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. కొత్తపల్లి- కొత్తపల్లితండాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణం కోసం రెండేళ్ల క్రితం వేసిన కంకర వల్ల తీవ్ర ఇబ్బందులతో పాటు ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు ఆయనకు మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ ఉన్నతాధికారులతో మాట్లాడి బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు తప్పనిసరి


చింతపట్లల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న నర్సింహ, విలాస్‌రావు తదితరులు

- రైతులను ఇబ్బంది పెడితే సహించం
- డీఆర్‌డీఏ అధికారుల బృందం

యాచారం: ధాన్యం కొనుగోళ్లలో నింబంధనలు పాటించాలని.. కొర్రీలు పెట్టి రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని డీఆర్‌డీఏ డీపీఎంలు నర్సింహ, విలాస్‌రావు అన్నారు. మండల పరిధిలోని నందివనపర్తి, చింతపట్ల, యాచారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం డీపీఎంలు సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లను నింబంధనల ప్రకారమే నిర్వహించాలని, కేంద్రాలకు తెచ్చిన ధాన్యం వర్షాలు వస్తే తడిసి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం విక్రయించిన 48 గంటలకలోపూ రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సాంబశివుడు, సీసీలు దార గణేష్, నర్సింహ, అశోక్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో టెక్నీషియన్ మృతి

నందిగామ: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం జింకురాల గ్రామానికి చెందిన ఈశ్వర్ కొంతకాలంగా విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద ఎలక్ట్రికల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. డీఎల్ఎఫ్ వెంచర్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కమే మృతి చెందాడు. మృతుడి తల్లి నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు ఉద్యోగి దుర్మరణం

ఆమనగల్లు: మండల పరిధిలోని కోనాపూర్‌గేటు సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో అమెజాన్ ఉద్యోగి దుర్మరణం చెందాడు. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని గుర్రంగుట్ట కాలనీకి చెందిన కావటి శ్రీకాంత్(25) ఆరేళ్లుగా తుక్కుగూడ సమీపంలో ఉన్న అమెజాన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం విధులకు హాజరైన ఆయన తన బైక్‌పై శనివారం ఇంటికి వస్తున్న క్రమంలో సుమారు ఉదయం 3గంటల ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రమాద కారణాలు తెలియరాలేదు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబీకులను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి పరామర్శించారు.


శ్రీకాంత్ (ఫైల్)

పిడుగుపాటుకు గేదె మృత్యువాత

కందుకూరు: పిడుగు పాటుతో ఓ పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని బేగంపేట పంచాయతీ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మాదారం రాజుగౌడ్ గ్రామ పరిధిలోని గాజులబురుజుతండా వద్ద ఉన్న పొలంలో పశువులను పోషిస్తున్నాడు. ఈక్రమంలో సాయంత్రం ఆయన వ్యవసాయ క్షేత్రంలోని చెట్టుపై పిడుగు పడడంతో కింద ఉన్న పాడిగేదె మృత్యువాత పడింది. పశుపోషణతో జీవనం సాగిస్తున్న తనను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరాడు.


గేదె కళేబరం వద్ద రైతు

ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి భారీ విరాళం

రూ.15 లక్షల చెక్కు అందజేసిన కేసర్ ఇండస్ట్రీస్

షాద్‌నగర్: దాతల సహకారంతో షాద్‌నగర్ పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి కేసర్ ఇండస్ట్రీస్ అధినేత బంకట్ లాల్‌బాటీ శనివారం భారీ విరాళం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసిన రూ.15 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరిందని.. దాతల సహకారంతో అత్యాధునిక సదుపాయాలతో కూడిన నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. పేద విద్యార్థుల చదువులకు దాతలు సహకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుడు కాశీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న వ్యాపారవేత్త

అదిగో హైడ్రా ఠాణా..

- తొలి ఎస్‌హెచ్‌ఓగా తిరుమలేష్ నియామకం
- ప్రాథమికంగా 20 మంది అధికారులు, సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పోలీసుస్టేషన్ తొలి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్ఓ) పి.తిరుమలేష్‌ను నియమించాలని నిర్ణయించినట్లు కమిషనర్ ఏవీ రంగనాథ్ 'సాక్షి'కి తెలిపారు. హైడ్రా ప్రధాన కార్యాలయం ఉన్న బుద్ధభవన్ పక్కనే ఏర్పాటవుతున్న ఈ ఠాణా పనులు ప్రస్తుతం తుది దశకు చేరాయి. ఈ నెల 8న (గురువారం) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హైడ్రా పోలీసుస్టేషన్ ప్రారంభం కానుంది.

వాటి తరహాలోనే పనితీరు..

శాంతిభద్రతల విభాగం పోలీసుస్టేషన్ తరహాలోనే హైడ్రా ఠాణా కూడా పని చేయనుంది. అందుకు తగ్గట్టే గదులు, క్యాబిన్లు ఉండాలని కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. అక్కడ పని చేసే అధికారులతో పాటు ఫిర్యాదు చేయడానికి వచ్చే వారికీ పూర్తి సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్ల తరహాలో ఈ ఠాణాకు డీఎస్పీ స్థాయి అధికారి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్ఓ) ఉండనున్నారు. తొలి ఎస్‌హెచ్ఓగా పి.తిరుమలేష్‌ను ఎంపిక చేశారు. కాజీపేట ఏసీపీగా పని చేసిన ఈయన ఇటీవలే హైడ్రాకు డిప్యుటేషన్‌పై వచ్చారు. ప్రాథమికంగా డీఎస్పీ నేతృత్వంలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు సబ్–ఇన్‌స్పెక్టర్లు, 15 మంది హెడ్‌-కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లతో హైడ్రా ఠాణా పని చేయనుంది.

ఆ కేసులన్నీ ఇక్కడికే..

ఓఆర్ఆర్ లోపలి భాగం, దానికి ఆనుకుని ఉన్న మున్సిపాలిటీల పరిధిలో హైడ్రాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గత ఏడాది జూలై 19న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విభాగం చెరువులు, ప్రభుత్వ భూములు, పార్కుల తదితరాలను కబ్జా చేయడం, పూడ్చివేయడం తదితర అంశాలపై దృష్టి పెడుతోంది. జలవనరుల్లో కట్టడాలకు అడ్డగోలుగా అనుమతులు ఇవ్వడాన్నీ తీవ్రంగా పరిగణిస్తోంది. దీనిపై ప్రస్తుతం ఆయా పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తోంది.

➡ కొన్ని కేసుల్లో ప్రజా ఆస్తుల విధ్వంసాల నిరోధక చట్టాన్ని ప్రయోగిస్తున్నారు. దైనందిన కార్యకలాపాల్లో ఉండే స్థానిక పోలీసులు ఈ అంశాలకు కీలక ప్రాధాన్యం ఇచ్చి దర్యాప్తు చేయలేకపోతున్నారు. ఇది కబ్జాకోరులు, అక్రమార్కులకు వరంగా మారుతోంది. ఇకపై ఇలాంటి కేసుల్ని నేరుగా హైడ్రా ఠాణాలోనే నమోదు చేసి, దర్యాప్తు చేస్తారు. గత ఏడాది జూలై నుంచి హైడ్రా ఫిర్యాదుతో వివిధ ఠాణాల్లో నమోదైన కేసుల్లో చార్జిషీట్ దాఖలు కానివీ ఈ పోలీసుస్టేషన్‌కే బదిలీ అవుతాయి.

తనిఖీలు చేసే అధికారం ఉంటుంది..

హైడ్రా ఠాణాకు సాధారణ పోలీసుస్టేషన్‌కు ఉండే అన్ని అధికారాలూ ఉంటాయి. నాంపల్లిలోని తొమ్మిదో అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో ఈ కేసుల విచారణ జరుగుతుంది. కబ్జా కేసుల్లో నిందితులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి నోటీసులు జారీ చేసి, అవసరమైన పత్రాలు సమర్పించాలని కోరే అధికారం ఉంటుంది. వీటిని పట్టించుకోని వారితో పాటు తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారినీ అరెస్టు చేస్తాం. అవసరమైతే తనిఖీలు చేపట్టడానికీ హైడ్రా పోలీసులకు అధికారం ఉంది. – ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్

గంజాయి సేవిస్తున్న ఐదుగురికి రిమాండ్

సుభాష్‌నగర్: బహిరంగ ప్రదేశంలో గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులను సూరారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..సాయిబాబానగర్‌లో గంజాయి సేవిస్తున్నారని పక్కా సమాచారం అందుకున్న పోలీసులు శనివారం అడ్డాపై దాడులు నిర్వహించారు. మహ్మద్ ఇమామ్, మహ్మద్ అస్లాంఅలీ, మహ్మద్ సొహైల్, దీపక్, పవన్‌కుమార్‌లు గంజాయి సేవిస్తూ పోలీసులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బీదర్ రైల్వేస్టేషన్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం వారిని రిమాండ్‌కు తరలించారు.